బూచివాడు

మొదటి దృశ్యం

(రాత్రి తొమ్మిదిగంటల సమయం. బాబుకి నిద్రరాక తల్లిని చిత్రవిచిత్రమైన ప్రశ్నలు వేస్తూ ఉంటాడు. తల్లి ఆప్రశ్నలకి తోచిన సమాధానాలు చెబుతూఉంటుంది.)

బాబు: రాత్రి ఎల్లా అవుతుంది అమ్మా?

తల్లి: సూర్యుడు వెళ్ళిపోవడంతోనే చీకటి పడుతుంది. దానినే మనం రాత్రి అంటాము.

బాబు: సూర్యుడు ఎందుకు వెళ్లిపోతాడు?

తల్లి: ఉదయంనించీ సాయంత్రంవరకు ఆకాశంలో తిరిగి తిరిగి అతనికి విసుకేస్తుంది. అలసి సొలసి ఇంటికి వెళ్లి నిద్రపోతాడు.

బాబు: ఇప్పుడు ఎన్నిగంటలు అయింది?

తల్లి: తొమ్మిది అయిఉంటుంది.

బాబు: ఇంత రాత్రి అయినా నాన్న ఎందుకు ఇంటికి రాలేదు?

తల్లి: ఏమో ఏదైనా పని ఉండిఉంటుంది. అందుకోసమే రాలేదనుకుంటాను.

బాబు: సూర్యుడు ఉదయంనించీ సాయంత్రంవరకూ తిరిగి అలసిపోతాడని చెప్పావు. నాన్నకూడా ఉదయమే

ఇంటినించి వెడుతాడు. ఇంతరాత్రి అయినా ఇంటికిరాడు. సూర్యుడికి మల్లే నాన్న అలసిపోడా?

తల్లి: బాబూ, నీవు ఏవో పిచ్చి పిచ్చి ప్రశ్నలన్నీ అడిగి నన్ను వేధించుకుతింటావు. నీకు సమాధానాలు చెప్పడానికి రోజుకు మూడు శేర్ల అన్నమైనా తినాలి—ఇప్పటికే చాలా రాత్రి అయింది. ఇక పడుకో.

బాబు: నాకు నిద్దర రావడంలేదు – నేను పడుకోను.

తల్లి: బూచివాడు వస్తాడు—పడుకో బాబు—

బాబు: ఎల్లాఉంటాడమ్మా, బూచివాడు.

తల్లి: నల్లగా, భయంకరంగా ఉంటాడు. పైనగొంగడి వేసుకొని పొడుగాటి కఱ్ఱతో రాత్రిళ్లు వస్తాడు. అల్లరి చేసే పిల్లలనీ, త్వరగా పడుకోని పిల్లలనీ ఎత్తుకుపోతాడు.

బాబు: ఈ రోజు నేను నిద్దరపోలేదు. బూచివాడు నన్ను ఎత్తుకుపోవడానికి వస్తాడా?

తల్లి: వస్తాడనే, పడుకోమని నీకు పదేపదే చెబుతున్నది.

బాబు: ఇంకా ఎల్లాఉంటాడమ్మా బూచివాడు?

తల్లి: చింతనిప్పులకు మల్లే కళ్లు ఉంటాయి. కారుచీకట్లో చుక్కలకుమల్లే నల్లటి మొహంలో తెల్లటికళ్లు మెరుస్తాయి.

బాబు: బూచివాడు, సూర్యుడూ, నాన్నకు మల్లే ఉదయంనించి సాయంత్రంవరకు పని చేయడూ?

తల్లి: లేదు, సాయంత్రం నించీ ఉదయంవరకు పని చేస్తాడు.

బాబు: ఏమి పని చేస్తాడమ్మా?

తల్లి: కొంటెపిల్లలనీ, అల్లరిపిల్లలనీ ఎత్తుకుపోతాడు.

బాబు: ఎక్కడికి ఎత్తుకుపోతాడు?

తల్లి: నల్లటి చీకటిలోకి ఎత్తుకుపోతాడు.

బాబు: చీకటిలోకి ఎత్తుకుపోతే భయమెందుకమ్మా? నేనైతే హాయిగా వెళ్లిపోతాను.

తల్లి: పిల్లలు, బూచివాడంటే భయపడాలి, అల్లా మాట్లాడుతారా?

బాబు: బూచివాడు నాన్నని ఎత్తుకుపోయి ఉంటాడు. అందుకోసమే నాన్న ఈ రోజు ఇంటికి రాలేదు.

తల్లి: వాడు పెద్దవాళ్లని ఏమీ అనడు—చిన్నపిల్లలను మాత్రమే ఎత్తుకుపోతాడు.

బాబు: అయితే, ఈ రోజు రాత్రికి వస్తాడా?

తల్లి: నీవు నిద్దరపోకపోతే తప్పకుండా వస్తాడు.

బాబు: నేను నిద్దరపోను—వస్తే ఎల్లా ఉంటాడో చూస్తాను.

తల్లి: అదుగో! రానేవచ్చాడు. కళ్లుమూసుకో బాబు! ఏయ్ బూచోడా! మా పిల్లవాడు నిద్దరపోయినాడు—వెళ్లి పో.

బాబు: నేను నిద్దర పోలేదు — బూచోడా నన్ను ఎత్తుకెళ్లు—

తల్లి: బూచివాడు రాలేదుకామాలు—అందుకోసమే నిన్ను ఎత్తుకెళ్లలేదు—పక్కింటి సుధ అల్లరి చేస్తూఉండింది—బహుశా ఆ అమ్మాయిని ఎత్తుకుపోయి ఉంటాడు.

బాబు: అప్పుడు నేను అల్లరి చేస్తే నన్ను ఎత్తుకు పోతాడా?

తల్లి: ఈ రోజుకి ఇక మనవీధికి రాడు—రేపు నీవు అల్లరిచేస్తే నిన్నుకూడా ఎత్తుకు పోతాడు.

బాబు: అయితే రేపు తప్పకుండా అల్లరిచేస్తాను—

తల్లి: ఇప్పటికి పడుకో—రేపటి సంగతి రేపు ఆలోచిద్దాం—

బాబు: నేను పడుకున్న తరువాత బూచివాడువస్తే నన్ను లేపుతావుకదూ?

తల్లి: సరే లేపుతాను - ఇకపడుకో.

బాబు: పాటపాడితే పడుకుంటాను.

తల్లి: మొదట కళ్లుమూసుకో — తరువాత పాడుతాను.

(బాబు కళ్లు మూసుకుంటాడు—తల్లి చక్కని జోలపాట పాడి అతన్ని పడుకో బెడుతుంది.

రెండవ దృశ్యం

(మరునాడు ఉదయం ఎనిమిది గంటలు. తండ్రి కాఫీ తాగుతుంటాడు. బాబు అప్పుడే నిద్దరలేచి, కళ్లు నులుముకుంటూ వచ్చి తండ్రిని ప్రశ్నపరంపరలతో ముంచివేస్తాడు)

బాబు: బూచివాడు ఎల్లాఉంటాడు నాన్నా?

తండ్రి: ఇప్పుడు వాడిసంగతి ఎందుకు వచ్చింది?

బాబు: అది కాదునాన్నా! నాకు బూచివాడు ఎల్లా ఉంటాడో తెలుసుకోవాలని ఉంది.

తండ్రి: బూచివాడు నల్లగా చీకటికిమల్లే ఉంటాడు.

బాబు: కఱ్ఱతీసుకొనివస్తాడా?

తండ్రి: లేదు, కఱ్ఱఉండదు——

బాబు: గొంగడి కప్పుకుని వస్తాడా?

తండ్రి: లేదు, గొంగడికూడా ఉండదు-అసలు వాంటిపైన ఏమీ ఉండదు.

బాబు: పళ్లుఎల్లా ఉంటాయి?

తండ్రి: పళ్లు మామూలుగానే ఉంటాయి. కాని మీసాలు గుబురుగా భయంకరంగా ఉంటాయి.

బాబు: ఇంకా ఎల్లా ఉంటాడు నాన్నా బూచివాడు?

తండ్రి: జుట్టువిరియబోసుకొని ఉంటాడు. మోకాళ్ల వరకు పంచె కట్టుకుంటాడు.

బాబు: వాడేమిచేస్తాడు నాన్నా?

తండ్రి: అల్లరి పిల్లలను ఎత్తుకుపోతాడు.

బాబు: ఎప్పుడు వస్తాడు నాన్నా?

తండ్రి: ఇప్పుడునీవు అల్లరిచే స్తే, ఇప్పుడే వస్తాడు—

బాబు: రాత్రిళ్లు వస్తాడని అమ్మ చెప్పింది.

తండ్రి: బూచివాడికి రాత్రీ, పగలూ అనే భేదంలేదు. పిల్లలు ఎప్పుడు అల్లరిచేస్తే అప్పుడే వస్తాడు.

బాబు: బూచివాడు నాకు కనపడుతాడా?

తండ్రి: లేదు కనపడకుండా వచ్చి పిల్లలను ఎత్తుకు పోతాడు?

బాబు: గొప్ప చిక్కేవచ్చింది—కనపడకండావస్తే ఏమిలాభం—

తండ్రి: చిక్కెందుకు బాబు?

బాబు: మొనగాడైతే కనపడి ఎత్తుకుపోవాలి—చాటుగా ఎత్తుకుపోవడం ఏమంత గొప్పదనం?

(పిల్లవాడి మాటలకి తండ్రి చిరునవ్వు నవ్వుతాడు. బాబు ఆసంగతి గమనించకండా అక్కడినించి వెళ్లిపోతాడు)

మూడవ దృశ్యం

(అదేరోజు మధ్యాహ్నం—అన్నయ్య చదువుకుంటూ ఉంటాడు. బాబు అల్లరి చేయకండా గదిలోకి వచ్చి తదేకదీక్షగా అన్నయ్య వేపుచూస్తాడు)

అన్నయ్య: ఎందుకు వచ్చావు బాబు?

బాబు: "..............."

అన్నయ్య: నేను చదువుకుంటూవుంటే అల్లరిచేయడానికి వచ్చావా?

బాబు: లేదు—

అన్నయ్య: మరి ఎందుకు వచ్చావు?

బాబు: "............."

అన్నయ్య: ఫరవాలేదు చెప్పు!

బాబు: బూచివాడు ఎల్లా ఉంటాడు అన్నయ్యా!

అన్నయ్య: ఇందుకోసమే వచ్చావా నీవు?

బాబు: అవును— బూచివాడు ఎల్లా ఉంటాడో కనుక్కుందామని వచ్చాను. చెప్పవు అన్నయ్యా?

అన్నయ్య: చెబితే అల్లరి చేయకండా ఇక్కడినుంచి వెళ్లిపోతావా?

బాబు: ఆఁ

అన్నయ్య: ఎల్లా ఉంటాడేమిటి? నల్లగాఉంటాడు-చూస్తేనే భయంవేస్తుంది.

బాబు: నీవు వాడిని చూచావా అన్నయ్యా?

అన్నయ్య: చూచాను-చాలా భయమేసింది. గట్టిగా కళ్లుమూసుకున్నాను.

బాబు: నిన్ను ఎత్తుకుపోలేదా అన్నయ్యా వాడు?

అన్నయ్య: లేదు - కళ్లుగట్టిగా మూసుకుంటే, దయ దలచి వదిలివెళ్లాడు.

బాబు: బూచివాడు ఎల్లాఉన్నాడు?

అన్నయ్య: నల్లగా ఉన్నాడని ఇంతకుముందే చెప్పానే!

బాబు: చేతిలో కఱ్ఱఉందా? బుజంపైన గొంగడి ఉందా?

అన్నయ్య: వాడిని చూచేసరికే, నాకు భయమేసింది. నేను అవి ఏవిచూడలేదు.

బాబు: గొంగడి, కఱ్ఱా లేవనుకుంటాను?

అన్నయ్య: నాకు చూచినట్లు జ్ఞాపకంలేదు.

బాబు: ఈ రోజు రాత్రికి వస్తాడట-అమ్మ చెప్పింది.

అన్నయ్య: వస్తేరావచ్చు—నీవు అల్లరిచేయకండా త్వరగా పడుకో. అప్పుడు వాడు నిన్నేమీ అనడు-తెలిసిందా?

బాబు: లేదు అన్నయ్యా - అల్లరిచేస్తాను. అల్లరి చేస్తే వాడిని చూడడానికి వీలుఅవుతుంది.

అన్నయ్య: చిన్న పిల్లలు వాడిని చూడకూడదు. చూస్తే భయమేస్తుంది. భయానికి జ్వరంవస్తుంది.

బాబు: వస్తే వచ్చింది. నేను తప్పకుండా అల్లరి చేస్తాను. తప్పకుండా బూచివాడిని చూస్తాను.

అన్నయ్య: ఏడ్చావు-వెళ్లు ఇక్కడినించి వెళ్లు.

బాబు:

చేస్తాను-అల్లరి-చేస్తాను
చేస్తాను-అల్లరి-చేస్తాను
(పాటకి మళ్లె పాడుతూ గంతులు వేస్తాడు)

అన్నయ్య: అల్లరిచేయవద్దని నీకుకదూ నేను చెప్పింది. అల్లరిచేయనని బొంకి, ఏమీ తెలియనట్టు మళ్లీ మొదలు పెట్టావా? ఇంతకీ నీవు ఇక్కడినించి వెళ్లిపోతావా లేదా ?

బాబు:

చేస్తాను అల్లరి-చేస్తాను
చేస్తాను-అల్లరి-చేస్తాను
అల్లరిచేసి-బూచివాడిని-చూస్తాను
చూస్తాను-బూచివాడిని-చూస్తాను.

(బాబు అల్లరిగా పాడుతూ. అన్నయ్య గుడ్లెఱ్ఱజేయు డంతోనే అక్కడినించి తుర్రున పారిపోతాడు.)

నాల్గవ దృశ్యం

(రాత్రి 9 గంటలు—బాబు నిద్దరపోకండా, ఆ రోజు రాత్రి బూచివాడికోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు. తల్లి బాబుని నిద్దరపుచ్చడానికి ప్రయత్నిస్తున్నది.)

బాబు: ఎప్పుడు వస్తాడమ్మా బూచివాడు ?

తల్లి: నువ్వు పడుకోకపోతే ఇప్పుడేవస్తాడు.

బాబు: నేను పడుకోవడంలేదుగా, ఇంకా ఎందుకు రాడు—

తల్లి: బూచివాడు మనం రమ్మంటేవస్తాడా ఏమిటి? వాడికియిష్టం వస్తేవస్తాడు - లేకపోతే మానుకుంటాడు—

బాబు: పడుకోకపోతే వస్తాడని చెప్పావుకదూ ?

తల్లి: నిన్న అలాగే అనుకున్నాను—

బాబు: అయితే ఇప్పుడు రాడా?

తల్లి: ఏమోబాబు, నీమాటలతో నాకు విసికేస్తున్నది.

బాబు: ఎల్లా ఉంటాడమ్మా బూచివాడు?

తల్లి: నల్లగా ఉంటాడు – ఆసంగతి ఇదివరకే చెప్పానుగా ?

బాబు: కఱ్ఱా, గొంగడీ ఉంటాయా ?

తల్లి: ఆఁ, ఎందుకు ఉండవు? అవి లేకండావాడు బయటికి కదలడు—

బాబు: అంతా ఉత్తదే—అవి ఉండనే ఉండవు.

తల్లి: ఎవరు చెప్పారు నీకు ఉండవని?

బాబు: నాన్నా, అన్నయ్యా చెప్పారు.

తల్లి: తప్పు చెప్పిఉంటారు—

బాబు: కాదమ్మా అసలు బూచివాడు ఉంటాడా?

తల్లి: ఎందుకు ఉండడు-ఉండడని ఎవరు చెప్పారు?

బాబు: నీవు, వాడు రాత్రిళ్లు వస్తాడని చెప్పావు. నాన్న ఎప్పుడుపడితే అప్పుడే వస్తాడని చెప్పాడు. ఏదీ నమ్మడానికి వీలులేదు.

తల్లి: నేనే పొరబడ్డాను. వాడు ఎప్పుడు పడితే అప్పుడే వస్తాడు.

బాబు: అంతా అబద్ధం—అల్లరిచేస్తే వస్తాడని అన్నయ్యా, నాన్నా చెప్పారు—అల్లరిచేశాను. అల్లరిచేస్తే అన్నయ్య గదిలోనించి వెళ్లగొట్టాడే కాని బూచివాడు రాలేదు. ఈ రోజు రాత్రి వస్తాడని నీవు చెప్పావు— ఇంత సేపు కూర్చున్నా, వాడు రానేలేదు. అందుకోసం, అసలు బూచివాడు లేనేలేడని నేను అనుకుంటున్నాను.

తల్లి: ఎందుకులేడు? ఉన్నాడు - ఉన్నాడని నేను చెబుతున్నాగా ?

బాబు: లేదు, లేదు, లేదు—ఉంటే ఈపాటికి తప్పక కనపడేవాడే—చూపించమని అన్నయ్యనూ, నాన్ననీ, నిన్నూ అడిగాను - కాని ఎవ్వరూ చూపలేదు.

తల్లి: అందుకోసమే లేడంటున్నావా?

బాబు: లేకపోతే లేడంటాను. (అనవసరంగా ఎందుకు అంటాను—

తల్లి: నీకెవరు చెబుతారు బాబు—ఒకరు చెబితే నీవు అసలువింటావా?

బాబు: అబద్ధాలు చెబితే ఎందుకు వింటాను. నిజం చెబితే వింటాను.

తల్లి: పోనీ బూచివాడు లేడు—ఇకపడుకో.

బాబు: లేడుకదూ? లేడని నేను మొదలే చెప్పాను.

తల్లి: ఇకనన్ను అట్టే వేధించకు—ఇక పడుకో.

బాబు: లేడని గట్టిగా చెబితే పడుకుంటాను.

తల్లి: సరే లేడు-ఇకనైనా పడుకో.

బాబు: పాటపాడితే పడుకుంటాను వూరికే లేడంటే పడుకొంటానా?

తల్లి: సరే పాడుతాను—ఇక బబ్బో.

బాబు: పాడుమరి బబ్బుంటాను - బూచివాడు లేడు కదూ?

తల్లి: లేదని ఎన్నిసార్లు చెప్పాలి—మాబంగారు బాబుకదూ ఇక బుబ్బో—

బాబు: ఇదిగో కళ్ళుమూసుకుంటున్నాను. బూచి వాడని, ఇక ఎన్నడూ భయపెట్టవు కదూ?

తల్లి: భయపెట్టను—ఇక పడుకో.

బాబు: మా అమ్మె బంగారుతల్లి—పాటపాడు ఇంక పండుకుంటాను.

(తల్లి తీయతేనియ గొంతుకతో చక్కని జోలపాట పాడుతుంది. పాడుతూ బాబుని చిచ్చికొడుతుంది. అల్లరి బాబు బూచివాడి ఊసుమరిచి, పాటకి ఒళ్లు తెలియకుండా, హాయిగా నిద్దరపోతాడు)